ఆంధ్రజ్యోతి
5

వనపర్తి
జిల్లా వార్తలు
శుక్రవారం 2 మే 2025
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 41.4 ۱ కనిష్ఠం : 26.3

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య 7

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష

అధికార హస్తం.. గులాబీ సాయం

అర్ధరాత్రి కర్ణాటక వాహనాల్లో ఇసుక లోడింగ్



- గుడెబల్లూరు వద్ద కృష్ణానది నుంచి ఇసుక రవాణాలో వింత పోకడలు
- అధికారులతో లాబీయింగ్ కోసం కృష్ణ మండల బీఆర్ఎస్ నాయకుడి సాయం
- నదిలో దర్జాగా రోడ్డు వేసి కర్ణాటకకు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- అధికార పార్టీ నాయకుల పేర్లు బయటకు రాకుండా ఉండేందుకు ఎత్తుగడ
- హస్తం పార్టీలో పాత, కొత్త నాయకుల మధ్య ఇసుక రవాణాతో విభేదాలు

మహబూబ్‌నగర్, మే 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అక్రమ లేదా సక్రమ పనుల్లో సాధారణంగా ఏ నియోజకవర్గంలోనైనా అధికార పార్టీ నాయకులదే పైచేయి ఉంటుంది. వారి కనుసన్నల్లోనే దందాలు నడుస్తాయి.. ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వారికి అధినేత అభయహస్తం ఉంటుంది. కానీ నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో వింత పోకడలు కనిపిస్తున్నాయి. తమ పేర్లు బయటకు రాకుండా ఉండటం కోసం అధికార పార్టీ నాయకులే ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులను దందాలో చేర్చుకుని పనులు చక్కబెట్టుకుంటున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇది చూసిన కొంతమంది హస్తం కార్యకర్తలు కూడా ముక్కున వేలేసుకుంటున్నారు. కృష్ణానదిలో పైన ఉన్న భూములన్నీ నల్లరేగడి కావడంతో ఇక్కడ ఇసుక లభ్యత దాదాపు ఉండదు. కానీ నది పాయలుగా విడిపోయిన చోట, వేరే ఉపనదులు వచ్చి కలిసిన ప్రాంతాల్లో మాత్రం ఇసుక లభ్యత ఉంది. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడెబల్లూరు- ముడుమాల్ శివారులో మాత్రం ఇసుక లభ్యత భారీగానే ఉంది. దీన్ని ఆసరాగా చేసుకున్న నాయకులు గత ప్రభుత్వం నుంచే ఇసుక దందా నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొద్దిరోజులు దందా ఆగినా.. ప్రస్తుతం యథేచ్ఛగా నడుస్తోంది. అర్ధరాత్రి వేళల్లో కర్ణాటకలోని వివిధ ప్రాంతాలతో పాటు మక్తల్, నారాయణపేట, కృష్ణ, మాగనూరు మండలాలకు కూడా అక్రమంగా రవాణా చేస్తున్నారు.

వాస్తవానికి ఇక్కడ రీచ్ పెట్టి ఇసుక తవ్వకాలు చేపడితే ప్రభుత్వానికి ఆదాయమైనా వచ్చేది.. కానీ ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసే జరుగుతున్నా.. తమ దృష్టికి రాలేదని చెప్పి తప్పించుకుంటున్నారు. ఫొటోలతో పాటు వాస్తవాలు బయటపడుతున్నా.. కళ్లు ఉండీ కబోదిలా అధికారుల వ్యవహారశైలి ఉంటోంది.

దందా జరుగుతోందిలా...

కర్ణాటక నుంచి వచ్చే కృష్ణానది.. మహారాష్ట్ర నుంచి వచ్చే భీమా నది నారాయణపేట జిల్లా తంగిడిగి దత్త భీమేశ్వరస్వామి ఆలయం వద్ద సంగమమవుతాయి. ఈ క్రమంలో కుసుమూర్తి, గురుజాల్, హిందూపూర్, గుడెబల్లూరు, ముడుమాల్ శివారుల్లో ఇసుక మేటలు ఏర్పడతాయి. గుడెబల్లూరు- ముడుమాల్ శివారులోని మురహర్ దొడ్డి వెళ్లే మార్గం దగ్గర ఓంకారేశ్వర మఠం, మణికంఠ ఎత్తిపోతల పైభాగంలో ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. నదిలోకి టిప్పర్లు వెళ్లేందుకు సిమెంట్‌పైపులైన్లు వేసి.. కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మించారు. ఆ మట్టి రోడ్డుపై టిప్పర్లు, హిటాచీలు రోజూ తిరుగుతూ ఇసుక తవ్వకాలు చేసి.. రవాణా చేస్తున్నాయి. కర్ణాటక నుంచి వస్తున్న టిప్పర్లు రోజుకు 50 నుంచి 60 ట్రిప్పులు ఇక్కడ నుంచి ఇసుకను

- మిగతా 6లో..



నదిలోని ఇసుకను టిప్పర్లలో పోస్తున్న ఎక్స్‌కవేటర్



ఇసుక అక్రమ రవాణా కోసం కృష్ణానదిలో వేసిన మట్టి రోడ్డు



పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు స్టేజ్ 1లో పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- మార్చిలోగా పాలమూరు - రంగారెడ్డి పెండింగ్ పనులు పూర్తి చేస్తాం
- విద్యుత్ పవర్ పాయింట్ పూర్తి కాలేదు..
- ప్రాజెక్టును ఎలా ప్రారంభించారని అధికారులపై ఆగ్రహం
- మార్చి 31 , 2026 వరకు 100 శాతం పూర్తి చేస్తాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
- పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనులను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్/కోడేరు/రేవల్లి, మే 1(ఆంధ్రజ్యోతి) : గడిచిన పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహించిందని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎంపీ మల్లు రవి నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో పర్యటించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన విద్యుత్ ప్యానెల్ బోర్డు, ప్రాజెక్టు సబ్ స్టేషన్, మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పంపు హౌస్, నార్లాపూర్ రిజర్వాయర్, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు ప్యాకేజీ 3లో హెడ్ రెగ్యులేటర్, ఏదుల రిజర్వాయర్ పంప్‌హౌస్, నార్లపూర్‌లో హెడ్‌వర్క్స్, తీగలపల్లి, వట్టెంలల్లో పంపుహౌజ్ పనులను పరిశీలించారు.



ఏదుల రిజర్వాయర్ పరిశీలనకు వచ్చిన మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

ఈ సందర్భంగా కొల్లాపూర్, నాగర్‌కర్నూల్‌లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశాల్లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టుల సమస్యలు పరిష్కరించడానికి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. మార్చి లోగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పెండింగ్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మరో ఆరు నెలల్లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ ఏదుల వట్టెం, కర్వెన ఈ నాలుగు రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీరు నింపడానికి - మిగతా 6లో..

కార్మికులను కడుపులో పెట్టి చూసుకుంటాం



పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లిలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీపీఎం నాయకులు 8

గన్నీబ్యాగుల కోసం రైతుల ఎదురుచూపులు

- 15వేలు అవసరం ఉండగా 3వేలు మాత్రమే వచ్చిన బ్యాగులు
- గందరగోళం మధ్య గన్నీబ్యాగుల పంపిణీ 7

యువతి దారుణ హత్య 6

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలో ఘటన

అకాల వర్షంతో తీవ్ర నష్టం

ఉప్పునుంతలలో నేలవాలిన వరి పైరు



6

తోటల పెంపకానికి.. పెద్దపీట

- జిల్లాలో పెరిగిన ఆయిల్ పాం సాగు
- సబ్సిడీపై డ్రిప్పు, స్ప్రింక్లర్ల పంపిణీ
- అన్ని వర్గాల రైతులకు ప్రయోజనం
- పట్టు పరిశ్రమను పెంచేందుకు ప్రణాళిక
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో జిల్లా ఉద్యానశాఖ అధికారి వెంకటేశం



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నాగర్‌కర్నూల్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోటల పెంపకానికి ప్రత్యేక తోడ్పాటును ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను రూపొందించిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి మర్రి వెంకటేశం స్పష్టం చేశారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని ఇచ్చి అత్యధిక లాభాలు పొందే విధంగా రైతులను చైతన్య పరుస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా భౌగోళిక స్వరూపం, రైతాంగం ఆర్థిక స్థితిగతులను తెలుసుకునేందుకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వం చిన్న, సన్నకారు రైతులతో పాటు మిగతా వారికి చేకూరే ప్రయోజనాల గురించి విశదీకరించారు. గురువారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించిన అంశాలు ఆయన మాటల్లోనే..

జిల్లాలో తోటల పెంపకానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తక్కువ పెట్టుబడి, చీడ పీడల బాధ లేకుండా రైతు లు లాభం పొందేలా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పాం సాగును ప్రోత్సహిస్తోంది.

ఆయిల్‌పాం సాగు లాభదాయకంగా ఉంటుందా?

ఆయిల్‌పాం సాగుచేసే రైతులు ఆన్‌లైన్ విధానం ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ విధానం అంతా ఆన్‌లైన్ ప్రక్రియలో పూర్తయిన తర్వాత ఎకరాకు 57 మొక్కలు అందిస్తాం. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఏర్పడి మొక్కలకు నష్టం సంభవిస్తే తిరిగి అందజేస్తాం. ఆయిల్ పాం మంచి లాభదాయకంగా ఉంటుంది.

మార్కెట్‌లో డిమాండ్ ఎలా ఉంది..?

ప్రస్తుతానికి టన్ను రూ.21,660 అమ్ముడుపోతోంది. మార్కెట్‌లో నూనె గింజల ఉత్పత్తి తగినంత లేకపోవడంతో ఆయిల్‌పాం కు డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ఆయిల్‌పాం సాగుకు ప్రాధాన్యత ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

జిల్లాలో తోటల పెంపకం ఎలా ఉంది?

నాగర్‌కర్నూల్ జిల్లాలో 35,661 ఎకరాల్లో 15,300 మంది రైతులు వివిధ రకాలైన పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. 1,472 మంది రైతులు 1,187 ఎకరాల్లో కూరగాయలు, 30 మంది రైతులు 23 ఎకరాల్లో పూల సాగు చేస్తున్నారు. మరింత మంది రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచుతాం.

పట్టు పరిశ్రమను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనిపిస్తోంది?

అలాంటిదేమి లేదు. జిల్లాలో పట్టు పరిశ్రమను కూడా సమాంతరంగా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. ప్రభుత్వ పరంగా సహకారం ఉంది. కావాల్సిందల్లా రైతుల అభీష్టమే. నాగర్‌కర్నూల్ జిల్లాలో 40 ఎకరాల్లో మల్బరీని సాగు చేసిన రైతులు 20 చోట్ల షెడ్లు నిర్మించుకున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మరో 40 ఎకరాల్లో మల్బరీ సాగును పెంచి పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయాలని సంకల్పించాం. రెండు ఎకరాల్లో మల్బరీని సాగు చేస్తే రూ.60 వేల సబ్సిడీ, రూ.2,35,000 షెడ్డు నిర్మాణం కోసం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎస్సీ, ఎస్టీలకు షెడ్డు నిర్మాణం కోసం రూ.2,90,000 అందిస్తాం.

ఇప్పటి వరకు జిల్లాలో సబ్సిడీపై ఎన్ని స్ప్రింక్లర్లు, డ్రిప్పులు అందజేశారు?

తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు సబ్సిడీపై 620 ఎకరాల్లో డ్రిప్పు, 1,210 యూనిట్ల స్ప్రింక్లర్లు అందజేశాం. చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ అందజేయగా ఎస్సీ, ఎస్టీలకు 1 శాతం, పెద్ద రైతులకు 80 శాతం చెల్లించి ప్రయోజనం పొందారు. అదనంగా జీఎస్టీ కూడా చెల్లించారు.

ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారుల మృతి

- మరో నలుగురికి తప్పిన ప్రాణాపాయం



బండారు శ్రావణ్‌కుమార్(ఫైల్)



ఆదెర్ల రక్షిత(ఫైల్)



ఆదెర్ల గణేశ్ రెడ్డి(ఫైల్) 7

విద్యుదాఘాతంతో తల్లీ కొడుకుల మృతి

- పిండిగిర్నీ నడుపుతుండగా ప్రమాదం

- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు - తుమ్మలసూగురులో విషాద ఛాయలు

తాడూరు, మే 1 (ఆంధ్రజ్యోతి):పిండి గిర్ని నడుపుతుండగా విద్యుదాఘాతానికి గురై తల్లీ కొడుకులు మృతి చెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శ్రీనివాసాచారి కుమారుడు శ్రీకాంత్(16) ఉదయం 10 గంటల సమయంలో ఇంటి వద్ద ఉన్న పిండిగిర్నీ స్విచ్ ఆన్ చేశాడు. గిర్నీ నడుస్తుండగా దాన్ని ముట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న అతడిని తల్లి జయమ్మ (42) గమనించి, కాపాడేందుకు యత్నిస్తూ ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. ఆ సమయంలో పక్కనే ఉన్న కుమార్తె అంజలి అప్రమత్తమై మెయిన్ స్విచ్ ఆఫ్ చేసింది. వెంటనే 108కు ఫోన్ చేసి సమాచారం అందించింది. అంబులెన్స్ వచ్చేలోగా జయమ్మ మృతి చెందింది. ఆమెతో పాటు కొనప్రాణంతో ఉన్న శ్రీకాంత్‌ను అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతడు కూడా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భర్త శ్రీనివాసాచారి కూలీ పనులు చేస్తుండగా, భార్య జయమ్మ ఇంట్లోనే పిండి గిర్నీ నిర్వహిస్తోంది. సంఘటనపై భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు. విషయం తెలుసుకున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.



మృతి చెందిన జయమ్మ, శ్రీకాంత్ (ఫైల్)

వేసవి ఆటలు షురూ..

- జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



వేసవి శిబిరం ప్రారంభోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న గద్వాల అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ 6

'పది'లో రెయిన్‌బో విద్యార్థుల జయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని రెయిన్ పాఠశాల విద్యార్థులు జయభేరి మోగించారు. పాఠశాలకు చెందిన మహమ్మద్ హుస్సేన్ 575, సామ్యూల్ విక్టర్ 572, మెహరిఈన్‌ఫాతిమా 571, కుందన ప్రియ 570 మార్కులు సాధించారు. వంద శాతం ఫలితాలు సాధించగా, 61 శాతం పైగా మార్కులు సాధించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ నరేష్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఐసీఎంఆర్ బృందం పర్యటన



ఐసీఎంఆర్ బృందంతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అల్లే శ్రీనివాసులు

వనపర్తి వైద్యవిభాగం, మే 1 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్) బృందం పర్యటించింది. జిల్లాలో అసంక్రమిత వ్యాధుల నియంత్రణపై ఆరా తీశారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లే శ్రీనివాసులుతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ... అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా క్వాలిటీ సర్వీసులు, సేవల మెరుగుదలపై దృష్టి సారిస్తూ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయిలో స్క్రీనింగ్, ఫాలో అప్ సేవలు, రికార్డుల నిర్వహణను మెరుగుపరిచేందుకు అవసరమైన శిక్షణ సిబ్బందికి అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఆశా కార్యకర్తల నుంచి వైద్యాధికారుల వరకు ఎన్‌సీడీ సేవల అమలు స్థితిని పరిశీలిస్తూ మార్గదర్శకాలు ఇస్తామన్నారు. అంతకుముందు ఐసీఎంఆర్ బృందానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం జిల్లా అధికారి రామచంద్రరావు, ఐసీఎంఆర్ సభ్యులు రోహిత్, జిల్లా కో ఆర్డినేటర్ రవితేజ, శ్రీనివాస్‌కొండ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్
- వేసవి శిక్షణా శిబిరాలు ప్రారంభం



వేసవి క్రీడా శిబిరాలను ప్రారంభిస్తున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి క్రీడా శిబిరాలను చిన్నారులు, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత అన్నారు. జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను గురువారం జిల్లా ప్రధాన స్టేడియంలో వారు ప్రారంభించి, మాట్లాడారు. చిన్నారులు తమకు నచ్చిన క్రీడా అంశాన్ని ఎంపిక చేసుకొని రాణించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేసవిలో నెల రోజుల పాటు వివిధ క్రీడా అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పర్యవేక్షణలో మెలుకువలు నేర్చుకొని ఆటలో రాణించాలన్నారు. అనంతరం శిబిరాలను ప్రారంభించారు. అర్బన్‌లో 21, గ్రామీణ ప్రాంతాల్లో 10, మొత్తం 31 శిబిరాల్లో ఒలింపిక్‌లో గుర్తింపు ఉన్న కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, నెట్‌బాల్, చెస్ క్రీడా అంశాల్లో కోచ్‌లు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ రాజగోపాల్, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, క్రీడా సంఘాల ప్రతినిధులు కురుమూర్తి గౌడ్, జాకీర్, బాల్‌రాజ్, జగన్‌మోహన్‌గౌడ్, నర్సింహులు, వడెన్న, జియావుద్దీన్, వేణుగోపాల్, కోచ్‌లు సునీల్, పర్వేజ్, ఖలీల్ పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

కృషి చేస్తామన్నారు. అదే విధంగా ఉదండాపూర్ రిజర్వాయర్ నింపడానికి కావాల్సిన ప్రణాళిక చేపట్టినట్లు తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు పనులను 2026 మార్చి 31 లోపు 100 శాతం పూర్తి చేయడానికి సమీక్షిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అదే విధంగా ఎంజీఎల్ఐ ప్రాజెక్టులో నిరుపయోగంగా ఉన్న రెండు మోటార్లను మూడు నెలల్లో మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామన్నారు. గత ప్రభుత్వం కేవలం హంగు ఆర్భాటాలకు ప్రాధాన్యమిచ్చిందని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో ప్రధాన భాగమైన విద్యుత్ పవర్ పాయింట్ పూర్తి కానిదే ప్రారంభోత్సవాలు ఎలా చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి విద్యుత్ శాఖకు రూ.262 కోట్లు మంజూరు చేశామని, అన్ని పంపింగ్ స్టేషన్లకు అన్ని విధాలుగా పనులు పూర్తి చేయడానికి నిధులు వెచ్చిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. తప్పనిసరిగా ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగు అందిస్తామన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని నల్గొండ జిల్లాకు అవసరమైన 0.5టీఎంసీల నీటిని అదనంగా కృష్ణానది వరద జలాల నుంచి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఎస్ఎల్



కొల్లాపూర్‌లో పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఆరా తీస్తున్న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు , చిత్రంలో ఎంపీ మల్లు రవి



రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

బీసీ దుర్ఘటన వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా స్పందించి అంతుచిక్కని కార్మికుల ఆచూకీ గురించి పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు చెందిన దాదాపు 700మందినిరంగంలోకి దించినప్పటికీ ఆరుగురు కార్మికుల ఆచూకీ ఇప్పటి వరకు చిక్కకపోవడం పట్ల ప్రభుత్వం విచారం వ్యక్తం చేస్తుందని వారందరీ కుటుంబాలకు ఒక్కొక్కరికి 25లక్షల రూపాయల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. జువాలజీకల్ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు 8 విభాగాలకు చెందిన వారందరితో ముందు చేపట్టాల్సిన సహాయక చర్యలపై నిపుణుల కమిటీని వేశామని వారు నివేదిక అందించిన తర్వాత సహాయక చర్యలను ముందుకు కొనసాగిస్తామని చెప్పారు. అదే విధంగా వనపర్తి జిల్లాలోని ఏదుల పేజ్ టు రిజర్వాయర్లను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఎస్పీ రావుల గిరిధర్ మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎస్పీ రఘునాథ్ గైక్వాడ్, ఉమ్మడి జిల్లా డీసీసీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఈఎస్సీ అనిల్ కుమార్, డీఏస్పీ శ్రీనివాస్ యాదవ్, ఎస్ఈ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవి ఆటలు షురూ..

- జిల్లా అంతా ప్రారంభమైన శిక్షణ శిబిరాలు
- ఉత్సాహంగా పాల్గొంటున్న విద్యార్థులు



గద్వాల ఇండోర్ స్టేడియంలో సాధన చేస్తున్న క్రీడాకారులు

గద్వాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ఆరంభం నాటి నుంచి పది నెలలపాటు పాఠ్యపుస్తకాలతో కుస్తీ పడుతూ తరగతి గదులకు పరిమితమైన విద్యార్థులకు ఉపశమనం లభించింది. వేసవి క్రీడా శిక్షణ పేరుతో ప్రారంభమైన ఆటలు, ఆటల పోటీలు విద్యార్థులకు కొత్త ఉత్సాహాన్ని తెచ్చిపెడుతున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లోనూ వేసవి క్రీడా శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. మే నెల మొత్తం సాగనున్న క్రీడల శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపుతుండగా వారి ఆసక్తిని బట్టి ఎంచుకున్న క్రీడలో శిక్షణ ఇచ్చేందుకు నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేసుకున్నారు.

జిల్లాలో శిబిరాలు ఇలా..

సాధారణంగా వేసవి సెలవుల్లో మే 1వ తేదీ నుంచి క్రీడా శిక్షణ తరగతులు ప్రారంభం కావాల్సి ఉండగా గద్వాల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం ఏప్రిల్ 24వ తేదీన ప్రారంభం కావడం విశేషం. అదేవిధంగా జోగుళాంబ గద్వాల జిల్లాల్లో నాలుగు మునిసిపల్ పట్టణాలతో పాటు 13 మండలాల ఉండగా, అన్నింటా కలిపి మొత్తం 14 శిబిరాలను ఏర్పాటు చేశారు. ప్రతీ మునిసిపల్ పరిధిలో ఒక శిబిరం కొనసాగుతుండగా, మండలాలకు సంబంధించి పది చోట్ల శిబిరాలను ఏర్పాటు చేశారు. వీటిలో కబడ్డీ క్రీడకు సంబంధించి అయిజ మండలం మేడికొండ జడ్పీహెచ్ఎస్, గద్వాల మండలం చెనుగోనిపల్లి జడ్పీహెచ్ఎస్, గద్వాల పట్టణం ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు. అథ్లెటిక్స్ విభాగంలో అయిజ మండలం ఉతనూరు జడ్పీహెచ్ఎస్, గద్వాల పట్టణం ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఖోఖో క్రీడకు సంబంధించి అయిజ పట్టణం జడ్పీహెచ్ఎస్, మల్దకల్ మండలం అమరవాయిలో శిక్షణ ఏర్పాటు చేశారు. తైక్వాండో క్రీడకు సంబంధించి అయిజ పట్టణం జడ్పీహెచ్ఎస్, ధరూర్ జడ్పీహెచ్ఎస్, గద్వాల పట్టణం ఇండోర్ స్టేడియంలో శిక్షణ ఇస్తున్నారు. వాలీబాల్ క్రీడకు సంబంధించి మల్దకల్ మండలం ఎల్కూరు జడ్పీహెచ్ఎస్, ఉండవల్లి జడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఫుట్‌బాల్ క్రీడకు సంబంధించి మల్దకల్ జడ్పీహెచ్ఎస్, గద్వాల పట్టణం సోమనాద్రి స్టేడియంలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతీ క్రీడకు శిక్షణ ఇచ్చే కోచ్‌లకు ప్రభుత్వం గౌరవ వేతనంగా రూ.4 వేలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థుల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచేందుకు క్రీడలు, యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమకు ఆసక్తి ఉన్నక్రీడను ఎంచుకొని అందులో శిక్షణ పొందడం ద్వారా నైపుణ్యాన్ని పెంచుకొని రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించేందుకు శిబిరాన్ని అవకాశంగా అందిపుచ్చుకోవాలి.

- డీవైఎస్‌వో జితేందర్

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

తెలంగాణలోని క్రీడాకారులను ఒలింపిక్ స్థాయికి ఎదిగే విధంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక దృష్టిని సారించిందని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేసవి క్రీడలశిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్లకు బానిసలు కాకుండా క్రీడల పట్ల ఆసక్తిని పెంచినట్లయితే భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా ఎదుగుతారన్నారు. ప్రతిఒక్కరూ ఏదైనా ఒక క్రీడను ఎంచుకుని రాణించాలన్నారు.

వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- ఈ నెల 6 లోగా పేర్లు నమోదు చేసుకోవాలి
- జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్



మాట్లాడుతున్న జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘ ఆధ్వర్యంలో వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. గురువారం బోయపల్లి సమీపంలో ఎండీసీఏ మైదానంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు హెచ్‌సీఏ క్రీడాపోటీలకు ఎంపిక చేసే అవకాశలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సహకరంతో గతేడాది నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిబిరాలకు అవకాశం కల్పించిందన్నారు. జడ్చర్లలో 5న, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ 6న, నారాయణపేట, గద్వాలలో 7న శిబిరాలు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని, క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 6లోగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎండీసీఏ ప్రతినిధులు సురేష్‌కుమార్, వెంకటరామరావు, గోపాల్‌కృష్ణ పాల్గొన్నారు.

అకాల వర్షంతో తీవ్ర నష్టం



లత్తిపూర్‌లో గాలి వానకు నేలమట్టమైన గోశాల

ఉప్పునుంతల, మే 1 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఉప్పునుంతలతో పాటు మండలంలోని గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో కొరటికల్ చెందిన బుచ్చిరెడ్డికి సంబంధించిన నాలుగు ఎకరాల వరి నేలకు వాలినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా లత్తిపూర్ శివారులో దుందుబీ వాగు పరిసర ప్రాంతలో బాల గోపాలకృష్ణ ఏర్పాటు చేసుకున్న గోశాల నేలమట్టం అయ్యింది.

మన్నెవారిపల్లిలో 25మూగజీవాలు మృతి



మన్నెవారి పల్లిలో పిడుగుపాటుకు మృతి చెందిన గొర్రెలు

అచ్చంపేట రూరల్: మండలంలోని మన్నెవారిపల్లి సమీపంలో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతోపాటు పిడుగుపాటుకు జక్కుల సాయిలు చెందిన 25గొర్రెలు మృతి చెందాయి. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు. మన్నెవారిపల్లి గ్రామానికి చెందిన ఎస్.పూల్యా ధాన్యం తెచ్చి కల్లంలో ఆరబెట్టాడు. అకాల వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయి పోయాయి. సుమారు 70బస్తాలు తడిసి పోయాయని తెలిపారు.

యువతి దారుణ హత్య

నవాబ్‌పేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : వేధింపులు భరించలేక భర్త నుంచి విడిపోయి ఒంటరిగా జీవిస్తున్న ఓ యువతి తోడుగా, అండగా ఉంటాడని ఓ వ్యక్తిని నమ్మి అతడితో సహజీవనం చేసింది. ఓ పాపకు జన్మనిచ్చిన తర్వాత అతడు ఆమెను అడ్డు తొలగించుకునేందుకు కళ్లలో కారం కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండల పరిధిలోని కాకర్జాల గ్రామ సమీపంలో జరిగింది. ఎస్ఐ విక్రం తెలిపిన వివరాల ప్రకారం.. నవాబ్‌పేట మండలం కొల్లూర్‌కు చెందిన శ్రీరాం నరేశ్ ఓ ప్రధాన రాజకీయ పార్టీకి అనుబంధ సంఘం మండల నాయకుడిగా చలామణి అవుతున్నాడు. అతడికి గతంలో హైదరాబాద్‌కు చెందిన యువతితో వివాహం కాగా, మనస్పర్థలతో విడిపోయారు. అప్పటి నుంచి జడ్చర్ల పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమల్లో పని చేస్తూ జీవనం గడుపుతున్నాడు. అలాగే జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లికి చెందిన గీతాంజలి (22)కి గతంలో మహబూబ్‌నగర్ మండలం అప్పన్నపల్లికి రాజుతో వివాహం అయ్యింది. ఏడాది కాపురం తర్వాత భర్తతో విడిపోయి జడ్చర్లలో నివసిస్తోంది. ఈ క్రమంలో వారిద్దరికీ పరిచయం ఏర్పడి సహజీవనానికి దారి తీసింది. వారిద్దరికీ ఒక కుమార్తె పుట్టింది. ఆ తర్వాత నరేశ్ ఇద్దరినీ వదిలేసి స్వగ్రామం కొల్లూరులో ఉంటున్నాడు. దీంతో అనుమానం వచ్చిన ఆమె ఇటీవల తల్లి, సోదరితో కలిసి కొల్లూరులోని అతడి ఇంటికి వచ్చింది. గత నెల 29న గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టించింది. ఈ రోజు వీలు కాదని, మరోసారి మాట్లాడుకుందామని గ్రామ పెద్దలు చెప్పారు. దీంతో వారు ముగ్గురూ జడ్చర్లకు వెళ్లేందుకు గ్రామం నుంచి బయలుదేరారు. అయితే పంచాయితీ పెట్టడాన్ని అవమానంగా భావించిన నరేశ్ ఎలాగైనా ఆమెను అడ్డు తొలగించుకోవాలని భావించాడు. గ్రామం నుంచి కాలినడక వెళ్తున్న వారిని అడ్డగించాడు. గీతాంజలిని బైక్‌పై ఎక్కించుకొని శివారులోని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లాడు. ఆమె కళ్లల్లో కారం చల్లి, పదునైన ఆయుధంతో దాడి చేశాడు. చున్నీతో గొంతుకు ఉరి వేసి చంపేశాడు. అక్కడి నుంచి నేరుగా నవాబ్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తల్లి నీలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విక్రం తెలిపారు.

అధికార హస్తం.. గులాబీ సాయం...!

(5వ పేజీ తరువాయి)

తరలిస్తున్నాయి. గతంలో స్థానికంగా ఉన్న ఓ మండల నాయకుడి టిప్పర్లు మాత్రమే నడిచేవి. అయితే కర్ణాటకలోని గుర్మిట్కల్ నాయకుడు ఒకరు ఇక్కడి టిప్పర్లను రానివ్వకపోవడంతో అక్కడి నుంచే రోజూ రాత్రి టిప్పర్లు నదిలోకి దిగుతున్నాయి. స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన హిటాచీ ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ. 25వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక్కడి నుంచి కర్ణాటకలోని రాయచూరు, కడైచూర్ ఇండస్ట్రీయల్ ఏరియా, సైదాపూర్, గుల్బర్గా వరకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే స్థానికంగా కృష్ణ, మాగనూర్, నారాయణపేట, మక్తల్ పట్టణాలకు కూడా ఇసుకను తరలిస్తున్నారు. టిప్పర్లు వెళ్లి రోడ్లు పాడవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

పాత- కొత్త నాయకుల పంచాయితీ...!

ఈ ఇసుక అక్రమ రవాణా పాత, కొత్త నాయకుల మధ్య పంచాయితీలకు దారితీసి విభేదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో బీజేపీలో ఉండి, తర్వాత బీఆర్ఎస్‌లో చేరి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందులో చేరి.. కృష్ణ మండలంలోని ఓ నాయకుడు ఇసుక దందా చేస్తున్నారు. గతంలో గుడెబల్లూరుకు చెందిన ఒక సెటిలర్, నియోజకవర్గంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఇందుకు మద్దతు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఏమైందో కానీ అదే గ్రామానికి చెందిన మరో సెటిలర్, ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్న సీనియర్ నాయకుడు సాయం పొందుతున్నారు. నలుగురు కాంగ్రెస్ లీడర్లు ఇందులో కీలకంగా వ్యవహరిస్తుండగా.. తాజాగా ఓ బీఆర్ఎస్ లీడర్ ఇందులో చేరిపోయారు. గతంలో దందాలో ఉన్న మరో ఇద్దరు కాంగ్రెస్ లీడర్లు దందాకు దూరమయ్యారు. అయితే గులాబీ నాయకుడిని అధికారులతో లాబీయింగ్, మామూళ్లు ముట్టజెప్పేందుకు కీలకంగా వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇసుక దందా చేసే వ్యక్తి బీఆర్ఎస్‌లో ఉండగా.. కేవలం దందా కోసమే కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పుడు కూడా అతడి కనుసన్నల్లోనే దందా నడుస్తుండటంతో కాంగ్రెస్ పార్టీలో ఎప్పటి నుంచో ఉన్న సీనియర్ నాయకులు నారాజ్‌లో ఉన్నారు. ఈ ఇసుక రవాణాను నియోజకవర్గ పెద్ద మనుషులే ఆపరేట్ చేస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పైకి ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేస్తామని చెబుతున్నప్పటికీ.. తమకు చెడ్డపేరు రాకుండా బీఆర్ఎస్ నాయకులతోనే ఈ దందా చేయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక మాజీ వైస్ ఎంపీపీ, ఒక మాజీ ఎంపీటీసీ, ఇద్దరు స్థానిక నాయకులు, ఒక బీఆర్ఎస్ నాయకుడు కీలకంగా ఉండటంతో విభేదాలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. జెండా పట్టి తిరిగిన వారిని కాదని, అధికారంలోకి వచ్చిన తర్వాత పార్టీలో చేరిన వారిని ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో తూగుతూ తమకేం తెలియదని బుకాయించుకుంటూ వస్తున్నారు. వాస్తవాలు వెలుగులోకి వస్తున్నా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు.



తరలింపు కోసం డంప్ చేసిన ఇసుక

రీచ్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వలేదు



కృష్ణ,(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కృష్ణానదిలో ప్రభుత్వం ఎలాంటి రీచ్ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వలేదని కృష్ణ మండల తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. అనుమతులు లేకుండా పగలు, రాత్రి తేడా లేకుండా కృష్ణానదిలో ముడుమాల్, గుడెబల్లూరు, మణికంఠ ఎత్తిపోతల దగ్గర యధేచ్ఛగా రోడ్లు వేసి, ఎక్స్‌కవేటర్ల ద్వారా టిప్పర్లను నింపి ఇసుక తరలిస్తున్న విషయాలపై 'ఆంధ్రజ్యోతి' గురువారం వివరణ కోరగా ఆయన పైవిధంగా స్పందించారు. అదే విధంగా కృష్ణానదిలో మొత్రం రోడ్లు, అక్రమంగా ఇసుక రవాణా జరగుతున్నది వాస్తవమన్నారు. దీంతో కృష్ణానదిలో వేసిన రోడ్లు తొలగించి ఇసుక టిప్పర్లను పట్టుకుని సీజ్ చేస్తామన్నారు. అక్రమ రవాణా అరికట్టేందుకు జిల్లా శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అధికారుల ఆదే శాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

తైబజారు వేలాన్ని రద్దు చేయాలి



తైబజారు వేలం పాటను రద్దు చేయాలంటూ వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అయిజ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మునిసిపాలిటీలో బుధవారం నిర్వహించిన తైబజారు వేలం రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వారు మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. నాలుగేళ్ల క్రితం చిరు వ్యాపారులకు ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో అప్పటి ప్రతి పక్ష కాంగ్రెస్ నాయకులు తైబజారు వేలం పాటను వ్యతిరేకించాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేలం అధికారులు నిర్వహించలేదు. మునిసిపాలిటీ అధికారులు తైబజారు వేలం బుధవారం నిర్వహించటంతో చిరు వ్యాపారులు ఆర్థిక ఇబ్బందులతో ప్రతీ రోజు డబ్బులు చెల్లించలేమని స్థానిక కాంగ్రెస్ నాయకులతో విన్నవించారు. విషయం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో చర్చించి ఆయన సూచనల మేరకు తైబజారు వేలం రద్దు చేయాలని కోరారు. పాండురంగరాజు, సాంబశివుడు, లక్ష్మన్న, వీరన్న పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఉరి వేసుకొని యువకుడి ఆత్మహత్య



రమేష్ (ఫైల్)

తాడూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి రమేష్(29) బాగానే ఉన్న తిన్న తర్వాత బయట పడుకున్నాడు. తెల్లారాక రమేష్‌ను లేపేందుకు తలుపు తీయగా అప్పటికే కిటికీకి ఉరి వేసుకొన్నాడు. అనంతరం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాయనమ్మ రామలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురుస్వామి తెలిపారు. రమేష్‌కు తల్లిదండ్రులు లేరు. నాయనమ్మ దగ్గరే ఉండి జీవనం సాగిస్తున్నాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మాచర్ల జగన్నాథంగౌడ్ (ఫైల్)

పెద్దకొత్తపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : రైతు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలంలోని మహాసముద్రం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మాచర్ల జగన్నాథంగౌడ్(65) తన పొలం దగ్గర బోరు మోటారు కనెక్షన్ ఉన్న వైరు తగలడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ట్రాక్టర్ కింద పడి వ్యక్తి..

తిమ్మాజీపేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఇప్పలపల్లి గ్రామసమీపంలో నేరేళ్లపల్లి రాములు(45) ట్రాక్టర్ కింద పడి మృతి చెందినట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. ఊర్కొండకు చెందిన రాములు కూలీగా వెళ్లి పని ముగించుకుని ఇంటికి వస్తున్న తరుణంలో ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో కిందపడిపోయాడు. అతన్ని మహబూబ్‌నగర్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కూలీ పనులకు తీసుకెళ్లిన ట్రాక్టర్ యాజమాని నరసింహ, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కుమారుడు అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

గుడిసెకు నిప్పంటుకుని గేదె, ఎద్దు..

▸▸ మరో మూడు పశువులకు తీవ్ర గాయాలు

ఆత్మకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : పశువుల కొట్టానికి నిప్పంటుకుని గేదె, ఎద్దు మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉద్దుతుల పెద్ద కర్రెన్న రెండు ఎద్దులు, రెండు గేదెలు ఒక దూడను ఉదయం 10 గంటల సమయంలో నీళ్లు తాగించి కొట్టంలో కట్టేసి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో పక్క పొలం రైతు మొక్కజొన్న కొయ్యను తగలబెట్టడంతో పక్కనే ఉన్న గడ్డివాము, పశువుల కొట్టంకు నిప్పంటుకుంది. ఈ ఘటన మధ్యాహ్నం చోటు చేసుకోవడంతో చుట్టుపక్కల రైతులు అందరూ ఇంటికి వెళ్లిపోయారు. రెండు గంటల పాటు పశువుల కొట్టంలో మంటలకు తాళలేక మూడు పశువులు తాళ్లు తెంచుకుని స్వల్ప గాయాలతో బయటపడ్డాయి. ఎద్దు, గేదె తాళ్లు గట్టిగా కట్టి వేయడంతో అగ్నికి ఆహుతయ్యాయి. పశువైద్యులు చేరుకుని గాయాల పాలైన మూడు పశువులకు చికిత్స చేశారు. మరో గేదెకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు మహమూద్, రాము, నారాయణ పంచనామా చేశారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నష్టపరిహారం చెల్లించనున్నట్లు తెలిపారు.

పిడుగుపాటుతో ఆవు దూడ..

బల్మూరు, (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూలు జిల్లా బల్మూరు మండల పరిధిలోని గట్టుతుమ్మెన్ గ్రామంలో రైతు కృష్ణయ్యకు చెందిన ఆవు దూడ బుధవారం రాత్రి పిడుగుపాటుకు గురై చెందింది. గురువారం ఉదయం పొలానికి వెళ్లి రైతు చూసి బోరున విలపించాడు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని ఆయన కోరారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు..

వెల్దండ, (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం లోని అజిలాపూర్ గ్రామానికి చెందిన కేశమోని పల్లె యాదయ్యకు చెందిన కాడెద్దు పొలంలో విద్యుత్ తీగ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని యాదయ్య కోరాడు.

లారీని ఓవర్‌టేక్ చేయబోయి.. డివైడర్‌ను ఢీకొన్న కారు

▸▸ పలువురికి గాయాలు

మూసాపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని ఘటన గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు పుల్లారెడ్డి కుటుంబసభ్యులతో కలిసి రెండు కార్లలో వెళ్తున్నారు. 44వ జాతీయ రహదారి అడ్డాకుల వద్దకు రాగానే కారు ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. దీంతో పుల్లారెడ్డితో పాటు మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

తాడూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని భలాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగయ్య బ్యాండ్ పనుల నిమిత్తం మాదారం వైపు వెళ్తుండగా గురువారం ప్రమాదవశాత్తు సిర్సవాడ సమీపంలో బైక్‌పై నుంచి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు

వెల్దండ, మే 1 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలంలోని పల్గుతండాలో నేనావత్ మోత్యానాయక్, కుమారుడు అశోక్‌పై దాడిచేసిన కళ్యాణ్, మోహన్, దేవలపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. భూ వివాదం కారణంగా దాడిచేసినట్లు పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యమైన ఘటన జిల్లా కేంద్రం లో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ రహీం దర్‌రెడ్డి గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో సంతోష్‌కుమార్, నవ్యలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. సంతోష్‌కుమార్ టైలర్ పని నిమిత్తం వెళ్లడంతో అతని భార్య చెప్పకుండా వెళ్లిపోయింది. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

తండ్రితో గొడవ పడి..

మిడ్జిల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలం మరికల్ గ్రామానికి చెందిన భూదేవి, మిడ్జిల్ మండలం దోనూర్ గ్రామానికి వచ్చి ఏప్రిల్ 30వ తేదీ నుంచి కనిపించడంలేదని తల్లి శాంతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు గురువారం తెలిపారు. భూదేవికి భర్త పదేళ్ల క్రితం క్రితం మృతి చెందినట్లు తెలిపారు. తండ్రితో దోనూర్ గ్రామంలో గోడవపడి ఇంట్లో నుండి వెళ్లిపోయిందని తెలిపారు.

జీపీలలో జోన్ల ఏర్పాటు..?

▸▸ ప్రతీ నెల రెండు శుక్రవారాలు స్పెషల్ డ్రైవ్

▸▸ డీఎస్ఆర్ ఇక బయోమెట్రిక్ విధానం

▸▸ ఎంపీడబ్ల్యూల వేతనాలు విడుదల



పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఎంపీడబ్ల్యూవోలకు జోన్లను కేటాయించనున్నారు. ఇప్పటి వరకు జోన్ల వారీగా కాకుండా గ్రామంలో ఉన్న ఎంపీడబ్ల్యూలు (మల్టీ పర్పస్ వర్కర్స్) అందరూ ఉమ్మడిగా శానిటేషన్ విధులు నిర్వహించే వారు. ఇకపై వారికి గ్రామాలలో కొన్ని ప్రాంతాల పరిధిని ఏర్పాటు చేసి జోన్లగా ఏర్పాటు చేయనున్నారు. మేజర్ పంచాయతీలో నలుగురు నుంచి ఆరుగురు ఉంటే వారికి ఏర్పాటు చేసిన జోన్లను కేటాయిస్తారు. ఇద్దరు ఉన్న జీపీలలో వారికి రెండు జోన్లను ఏర్పాటు చేస్తారు. వారు ప్రతీ రోజు వారికి కేటాయించిన జోన్లలో శానిటేషన్ విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వారు నిర్వహించిన రోజువారి పనులను పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక యాప్‌లో ఎంపీవోలకు పంపించాల్సి ఉంటుంది. ఎంపీవోలు జిల్లా అధికారులకు పంపిస్తారు. దీంతో గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య పనులు సక్రమంగా జరిగే అవకాశాలు ఉంటాయని ప్రభుత్వం ఎంపీడబ్ల్యూలకు జోన్లను కేటాయించినట్లుగా తెలుస్తుంది. వారి జోన్లలో నెలలో ప్రతీ మొదటి శుక్రవారం, మూడో శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఎంపీడబ్ల్యూలు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను కార్యదర్శులు జిల్లా పంచాయతీ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది. రోజువారి శానిటేషన్ రిపోర్టును (డీఎస్ఆర్) మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రానున్న రోజుల్లో పంచాయతీలలో నిర్వహించే పారిశుధ్య పనుల తీరు మారే అవకాశాలు ఉన్నాయి.

కమిషనరేట్ నుంచి ఆదేశాలు రాలేదు



ఎంపీడబ్ల్యూలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు మాకు అధికారంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. గ్రామాలలో శానిటేషన్ విధానంలో ప్రభుత్వం మార్పులు చేసే అవకాశాలు ఉన్నాయి. అందుకు కొంత సమయం పట్టవచ్చు. ఎంపీడబ్ల్యూల పెండింగ్ వేతనాలు జనవరి, ఫిబవరి, మార్చి నెలల వేతనాలు రూ 3,92,5,500 టీఎస్‌బీపాస్ ద్వారా ప్రభుత్వం సర్దుబాటు చేసింది. వాటిని జిల్లాలోని 16 మండలాల్లో 1,453 మంది ఎంపీడబ్ల్యూల ఖాతాలలో జమ చేయడం జరిగింది.

- గిరీశ్‌కుమార్, డీపీవో కార్యాలయ ఏవో

వ్యక్తికి 20ఏళ్ల జైలు శిక్ష

కొత్తకోట, మే 1 (ఆంధ్రజ్యోతి) : లైంగికదాడి కేసులో దోషికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ ఆనంద్ గురువారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. 2021లో మండలంలోని సంకిరెడ్డిపల్లికి చెందిన చెన్నయ్య ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మల్లికార్జున్ రెడ్డి, ఎస్‌ఐ నాగశేఖర్‌రెడ్డి విచారణ చేపట్టారు. సీఐ రాంబాబు, ఎస్‌ఐ ఆనంద్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పీపీ శ్రీనివాసాచారి వాదించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.25వేల జరిమానా విధించారు.

కాడెద్దులు చోరీ

మానవపాడు, మే 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని బోరవెల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఇద్దరు అన్నదమ్ములకు చెందిన నాలుగు ఎద్దులు బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని తెలిపారు. బొలెరో వాహనంలో ఎక్కించి తీసుకెళ్లినట్లు ఆనవాళ్లు ఉన్నాయని ఇరువురు వాపోయారు. రెండు రోజులపాటు ఇతర ప్రాంతాల్లో, సంతల్లో వెతికినా ప్రయోజనం కనిపించ డంలేదని తెలిపారు. గురువారం కోదండాపురం పోలీస్‌స్టేషన్‌లో రైతులు ఫిర్యాదు చేశారు.

ప్రతీ ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

▸▸ ఉడిపి ఆదమూరు మఠాధీశులు విశ్వప్రియ తీర్థ స్వామీజీ



భక్తులకు సందేశం చేస్తున్న విశ్వప్రియ తీర్థ స్వామీజీ

నారాయణపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : భగవంతుడు అనంత గుణ, పరిపూర్ణుడని భగవంతుడిని ఆరాదిస్తే ముక్తికి మార్గమని ఉడిపి ఆదమూరు మఠాదీశులు విశ్వప్రియ తీర్థ స్వామీజీ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కోటకొండ నరసాచలంలోని భూ వేంకటేశ్వర స్వామి స్వర్ణోత్సవంలో భాగంగా నాలుగోరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వామీజీ మూల రాములు సంస్థాన పూజ నిర్వహించి భక్తుల నుద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. దైనందిన కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక చింతనకు ప్రతి నిత్యం కొంత సమయమైనా కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. ఉత్తరాది మఠానికి చెందిన విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచార్యులు భాగవత సప్తాహ పంచమ స్తంధాన్ని భక్తులకు వివరించారు. కార్యక్రమంలో గోవింద తీర్థ స్వాములు, నరసాచల సేవాసమితి సభ్యులు సీతారామారావు, జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థా చారి, శ్రీనివాస్, భరత్, హన్మేష్, ప్రకాశ్, శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన వేడుకలు



విగ్రహాల ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు



విగ్రహాలను ఊరేగిస్తున్న ప్రజలు

అచ్చంపేటటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): బొడ్రాయి పునఃప్రతిష్ఠపన ఉత్సవాల సందర్భంగా గురువారం పోచ్చమ్మతల్లి విగ్రహం, బొడ్రాయి మేళతాళాలతో పట్టణంలో ఊరేగించారు. మహిళలు తమ ఇళ్ల వద్ద జలాభిషేకం చేసి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఊరేగింపులో కోలాటాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విగ్రహాలు ఊరేగింపుగా బయలుదేరిన పట్టణ బొడ్రాయి, పోచ్చమ్మ అమ్మవార్ల విగ్రహాలను తీసుకొచ్చి సుగంధ ద్రవ్యాలతో జలధివాసం నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, ఉత్సవ కమిటీ సభ్యులు సతీశ్, కోట కిశోర్, రఘు, కాశన్న యాదవ్, బాలాజి పాల్గొన్నారు.

ప్రతీ కార్మికుడు ఇన్సూరెన్స్ చేసుకోవాలి

▸▸ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి నసీం సుల్తానా



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి నసీం సుల్తానా

కందనూలు, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్మికుడు కార్మిక శాఖలో ఇన్సూరెన్స్ తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధి కారసంస్థ నాగర్‌కర్నూల్ సెక్రటరీ నసీం సుల్తానా తెలిపారు. నల్లవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ కార్మికుల దినోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికులు ప్రమాదవశాత్తు గాయపడినా, చనిపోయినా ఆ బీమా తీసుకోవడం ద్వారా వారికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం లభిస్తుందని తెలిపారు. ఎవరికైనా ఆర్థికస్తోమత లేనిచో కోర్టు కేసుల్లో ఉన్న వారికి ఉచితంగా తమ సంస్థ తరఫున న్యాయవాదిని నియమిస్తామన్నారు. జూన్‌లో జరగనున్న జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులు అధిక సంఖ్యలో పాల్గొని సామరస్య పూర్వకంగా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులను మేడే సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్‌ఆర్య డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, న్యాయవాది బి.రామ చందర్, న్యాయవాది మాధవలక్ష్మణ్, పంచాయతీ సెక్రటరీ రాజేశ్వరి, ఉద్యోగులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గద్వాల క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలో గురువారం మల్లేశ్ అనే వ్యక్తి పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపారు. ఆ వివరాలు.. ధరూర్‌కు చెందిన మల్లేశ్ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి ఉన్నాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ధరూర్ ఎస్‌ఐ శ్రీహరిని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. సమాచారం తెలుసుకున్న ఆయన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి రాగా, మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్‌కు తరలించారు.

ఈతకు వెళ్లి ముగ్గురు చిన్నారుల మృతి

▸▸ మరో నలుగురికి తప్పిన ప్రాణాపాయం

పెద్దకొత్తపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఈత సరదా ముగ్గురు చిన్నారుల ప్రాణాలు తీసింది. మరో నలుగురు చిన్నారులకు ప్రాణాపాయం తప్పింది. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. బాధితులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన ఆదెర్ల ధర్మారెడ్డి కుమారుడు ఆదెర్ల గణేశ్ రెడ్డి (13), కుమార్తె ఆదెర్ల రక్షిత (10) రంగారెడ్డి జిల్లాలో 7, 5వ తరగతులు చదువుతున్నారు. బండారు సుధాకర్‌గౌడ్, రాధ దంపతుల రెండవ కుమారుడు బండారు శ్రావణ్ కుమార్ (7) పెద్దకొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 2 వ తరగతి చదువుతున్నాడు. వీరు ముగ్గురితో పాటు మరో నలుగురు బండారు వరుణ్, అంజుక్, దయశ్రీ, దీక్షిత్ గురువారం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం వెనుకనున్న పోతునేని చెరువుకు వెళ్లారు. మొదట ఒకరి వెనుక ఒకరు చెరువులో దిగిన గణేశ్ రెడ్డి, రక్షిత, శ్రావణ్ బురదలో చిక్కుకుని నీటిలో మునిగిపోయారు. ఈ దృశ్యాన్ని చూసిన మిగిలిన నలుగురు భయపడి ఒడ్డుకు చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొనే లోగా చుట్టుపక్కల రైతులు ముగ్గురి మృతదేహాలను వెలికి తీశారు. అదే సమయంలో అక్కడికి చేరిన బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుమారుడు, కుమార్తె చనిపోవడాన్ని ఆదెర్ల ధర్మారెడ్డి జీర్ణించుకోలేక పోతున్నారు. రెండేళ్ల క్రితం భార్యను కోల్పోయిన ఆయన తన ముగ్గురు పిల్లలను రంగారెడ్డి జిల్లాలోని ఓ ఆశ్రమ పాఠశాలలో (సరస్వతి శిశు మందిర్) చేర్పించారు. బండారు సుధాకర్‌గౌడ్ వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలం జమ్మాపూర్ గ్రామానికి చెందిన వారు కాగా చాలా కాలం క్రితం పెద్దకొత్తపల్లికి వచ్చి స్థిరపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ మహేశ్, ఎస్‌ఐ సతీశ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గన్నీబ్యాగుల కోసం రైతుల ఎదురుచూపులు

▸▸ 15వేలు అవసరం ఉండగా 3వేలు మాత్రమే వచ్చిన బ్యాగులు

▸▸ గందరగోళం మధ్య గన్నీబ్యాగుల పంపిణీ

నారాయణపేట, మే 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో నాలుగు రోజులుగా గన్నీబ్యాగుల కొరత ఏర్పడింది. 15వేలు అవసరం ఉండగా కేవలం 3వేల బ్యాగులు మాత్రమే గురువారం సాయంత్రం రావడంతో బ్యాగులకోసం రైతులు పోటీ పడే పరిస్థితి నెలకొంది. గొడవలు జరగకుండా పోలీసుల సమక్షంలో పంపిణీ చేశారు. మిగతా రైతులకు మళ్లీ వచ్చిన వెంటనే అందిస్తామని అధికారులు చెప్పుకొచ్చారు. ఇప్పటి వరకు 50వేల గన్నీ బ్యాగులు రైతులకు అందించామని మెప్మా నిర్వాహకులు తెలిపారు. 18వేల బస్తాల ధాన్యం కూడా కొనుగోలు చేశామన్నారు. బ్యాగులు తీసుకెళ్తున్న రైతులు ధాన్యం కేంద్రానికి తీసుకురావడంలో జ్యాపం చేస్తుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం

▸▸ బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): జనగణన, కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ అన్నారు. గురువారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జన, కుల గణన బాధ్యత పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదని తెలిపారు. దేశం మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ఇది కీలకమైనదని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తూ కులగణన గురించి ఆలోచించలేదని విమర్శించారు. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో కులం వారీగా రిజర్వేషన్లు అమలవుతున్నాయని వివరించారు. అనంతరం ప్రధాని చిత్రపటానికి పూలాబిషేకం చేశారు. సమావేశంలో పడాకుల బాలరాజ్, చెన్న వీరయ్య, నంబిరాజ్, నాగరాజు, పిల్లి సూర్యనారాయణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పడాకుల బాలస్వామి తల్లి మృతి చెందగా, కుటుంబసభ్యులను పరామర్శించారు.

స్కేటింగ్‌తో జ్యోతిర్లింగాల దర్శనం



హన్వాడ నుంచి స్కేటింగ్‌తో వెళ్తున్న రోహన్

హన్వాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రానికి చెందిన రోహన్ 12 జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు స్కేటింగ్ చేస్తూ ప్రయణం మొదలు పెట్టాడు. మహారాష్ట్రలోని జ్యోతిర్లింగాన్ని దర్శించుకొని శ్రీశైల మల్లికార్జునుడిని దర్శించుకునేందుకు వెళ్తుండగా గురువారం హన్వాడలో నిలిచాడు. ఈ సందర్భంగా అతనితో మాట్లాడగా.. దేశంలోని 12 జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు 80 రోజుల నుంచి స్కేటింగ్ చేస్తు తిరుగుతున్నట్లు చెప్పారు. శ్రీశైలంలో మల్లికార్జున స్వామిని దర్శించుకొని అటు నుంచి తమిళనాడులోని రామేశ్వర జ్యోతిర్లింగాన్ని దర్శించుకోనున్నట్లు తెలిపారు. ఇప్పటికి పది జ్యోతిర్లింగాలను దర్శించుకున్నట్లు వివరించారు.

న్యూస్ బాక్స్

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

- పశువైద్యాధికారి ఆంజనేయులు



గోపాల్‌పేట, మే 1 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులు పశువులకు ముఖ్యంగా ఎండా కాలంలో ఎక్కువ రోగాల బారిన పడుతాయని పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి ఆంజనేయులు అన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

మండలంలోని పశువులకి ఏమైన టీకాలు వేస్తున్నారా?

ప్రస్తుతం ఎండాకాలంలో పశువులు ఎక్కువగా రోగల బారిన పడుతుంటాయి. ముందస్తుగానే మండలంలో అన్ని గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశాం. ప్రస్తుతం మండల కేంద్రంలో టీకాలు వేస్తున్నాం.

మండలంలో మొత్తం ఎన్ని పశువులు ఉన్నాయి?

మండలంలో మెత్తం 8,150 పశువులు ఉన్నాయి.

ఎన్ని పశువులకు టీకాలు వేశారు?

ఇప్పటికే మండలంలోని పొలికేపాడ్, బుద్దారం, చాకల్‌పల్లి, తాడిపర్తి గ్రామాల్లో ఉండే పశువైద్య సిబ్బంది ద్వారా ఆవులు, గేదెలకు కలిపి 3,460 పశువులకు టీకాలు వేశాం.

మరి గొర్రెల పరిస్థితి ఏంటీ?

ఈ కాలంలో గొర్రెలకు పారుడు రోగం వస్తుంది. గొర్రెల కాపరులు ఈ రోగాన్ని గుర్తుపట్టి పశువైద్యులకు సమాచారం అందించినా.. పశు సిబ్బంది గొర్రెల మంద వద్దకు వచ్చి టీకాలు వేస్తాం.

న్యూస్ బాక్స్

మంత్రికి కాంగ్రెస్ నాయకుల సన్మానం

వనపర్తి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం జిల్లాలోని ఏదుల ఫేస్-2 రిజర్వాయర్‌ను సందర్శించడానికి వచ్చిన మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, పూలబొకేతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు కోట్ల రవి, కదిరె రాములు, ఎండీ బాబా, పెంటన్న యాదవ్, ద్యారపోగు విజయ్‌బాబు, నాగార్జున, చరణ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

30 వరకు పోలీస్ యాక్టు

వనపర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 30వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా పోలీస్ యాక్టు అమలులో ఉన్నట్లు ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఎక్కువ సంఖ్యలో గుమికూడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ఒక్కరు పోలీస్ శాఖకు సహకరించి శాంతిభద్రతల పరిరక్షణ కోసం కృషి చేయాలని తెలిపారు.

'కార్మికులకు అండగా ఉంటాం..'



రాజీవ్ చౌరస్తాలో జెండా ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వనపర్తి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కడుపులో పెట్టుకుని కాపాడుకున్నది మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. గురువారం కార్మికుల దినోత్సవం మేడేను పురస్కరించుకుని రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో వేడుకలను బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనునిత్యం కార్మికుల సంక్షేమం కోసం పరితపించే నాయకులు నిరంజన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డి అని అన్నారు. కార్మికులకు కమ్యూనిటీ హాల్స్ వ్యక్తిగత అవసరాలు తీరుస్తూ... అధికారం లేకపోయినా కార్మికులకు అండగా ఉంటున్నారని అన్నారు. పలుస రమేష్‌గౌడ్, వాకిటి శ్రీధర్, నాయకులు నందిమల్ల అశోక్, ఉంగ్లం తిరుమల్, గంధం పరంజ్యోతి, బీఆర్ఎస్ కార్మిక విభాగాల నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలి

అమరచింత, మే 1 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ కేంద్రంలో ఇళ్ల మంజూరులో అధికారులు అర్హులను గుర్తించాలని బీజేపీ నాయకులు మేర్వ రాజు, క్యామ భాస్కర్ లు పేర్కొన్నారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... మునిసిపాలిటీ కేంద్రంలోని ఆయా వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని కోరారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాడతామని అన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

డబ్బులు ఇస్తేనే... ఇల్లు ఇస్తారంటా!

- న్యాయం చేయాలని కోరుతున్న లబ్ధిదారులు
- సమస్యను పట్టించుకోని అధికారులు



మామిడిమాడలో మాట్లాడుతున్న డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు

ఖిల్లాఘణపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : డబ్బులు ఇస్తేనే డబుల్ బెడ్ రూం ఇల్లు ఇస్తామని అధికార పార్టీ నాయకుడు హుకుం జారీ చేస్తున్నాడని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు వాపోతున్నారు. మండలంలోని మామిడిమాడకి గత ప్రభుత్వ హయాంలో 2020 సంవత్సరంలో 40 డబుల్ బెడ్ రూం ఇళ్లు మంజూరు కాగా... 24 ఇళ్లను గ్రామ శివారులోని 40, 42 సర్వే నెంబర్లలో నిర్మాణం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణం చెత్తు స్థాయి వరకు పనులు చేసి బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ వదిలేయడంతో ఇటీవల కలెక్టర్ ఆదర్శ్ సురభి సందర్శించి ఆ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. మండలంలోని మామిడిమాడలో గురువారం లబ్ధిదారులు మాట్లాడుతూ... గతంలో ఇళ్లు నిర్మించి ఇస్తామంటే రూ.1,50,000 చొప్పున గ్రామంలోని అధికార పార్టీ నాయకుడికి అందజేశామని, మళ్లీ మరోసారి డబ్బులు ఇవ్వాలని అనుచరుల ద్వారా ఒత్తిడి తెస్తూ.. మనోవేదనకు గురి చేస్తున్నారని ఎస్సీ కమ్యూనిటీ లబ్ధిదారులు ప్రేమ్ కుమార్, చిన్న నాగయ్య, వెంకటస్వామి, వెంకటయ్య, కుర్మయ్య, నాగమ్మ, కళావతి, నాగేంద్రమ్మ విలేకరుల ఎదుట తమ గోడును తెలియజేశారు. ఇళ్ల నిర్మాణం కోసం డబ్బులు చెల్లించిన వివరాలు తెలిపారు. ఇళ్ల లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.2,16,000 ఇస్తేనే ఇంటి నిర్మాణం పూర్తి చేస్తామని, లేదంటే గతంలో ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అధికార పార్టీ నాయకుడు అనుచరుల ద్వారా బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

మరిన్ని డబ్బులు ఇవ్వాలంటా..



డబ్బులు ఇస్తేనే డబుల్ బెడ్ రూం ఇల్లు ఇస్తామని అంటున్నారు. గతంలో రూ.1,20,000 ఇచ్చాను. మళ్లీ డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొస్తున్నారు. డబ్బులు ఇవ్వకుంటే ఇల్లు రాదు, డబ్బులు రావని మధ్యవర్తులతో చెప్పి పంపిస్తున్నారు.

- చిన్న నాగయ్య, మామిడిమాడ

గుడిసెలో నివాసముంటున్నా..



నాకు ఇల్లు లేకపోవడంతో గుడిసెలోనే నివాసం ఉంటున్నాను. డబ్బులు ఇస్తేనే ఇల్లు ఇస్తాం అంటున్నారు. జీవనోపాధి కష్టంగా ఉన్న వాళ్లం. డబ్బులు ఎలా ఇవ్వగలుగుతాం. ప్రభుత్వం నిరుపేదలకు న్యాయం చేసి ఇల్లు కట్టించి ఇవ్వాలి.

- మనిగిల్ల కళావతి

మా దృష్టికి రాలేదు

మామిడిమాడలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణానికి సంబంధించి డబ్బులు వసూలు చేసినట్లు మా దృష్టికి రాలేదు. ఇళ్లు నిర్మాణ దశలోనే ఉన్నాయి. తహసీల్దార్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది.

- రమేష్ నాయుడు, పంచాయతీ రాజ్ ఏఈ, ఖిల్లాఘణపురం

రైతాంగ సాయుధ పోరాట వీరుడు పుచ్చలపల్లి



నివాళి అర్పిస్తున్న మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు

వనపర్తి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీరుడు పుచ్చలపల్లి సుందరయ్య అని ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో పుచ్చలపల్లి సుందరయ్య 112వ జయంతిని మహనీయుల స్ఫూర్తి వేదిన ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన సుందరయ్య స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. గిరిరాజాచారి, నరసింహశర్మ, బండలయ్య, గట్టయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వెంటనే కొనుగోలు చేసి రైతుల ఇబ్బందులను తీర్చాలని సీపీఐ నాయకులు కాకం బాలస్వామి అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్ల రాశిపై బైఠాయించి నిరసన తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని లేదంటే జిల్లావ్యాప్తంగా సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పరశురాముడు, రాముడు, కోళ్లపిల్లి రాముడు, ఎల్లమ్మ పలువురు రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో 1984-85 పూర్వ విద్యార్థులు

ఖిల్లాఘణపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు గురువారం 40 సంవత్సరాలకు వారి గురువులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పద్మశాలి కల్యాణ మండపంలో నిర్వహించుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూల దండలు, శాలువాలు, మెమెంటోలతో సత్కరించుకున్నారు.

ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభం

వనపర్తి విద్యా విభాగం, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల పది ఫలితాలు విడుదల కావడంతో కళాశాలలో చేరే విద్యార్థులు ఇంటర్నెట్ మెమోతో ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ పొందవచ్చు అని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. 10వ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు అడ్మిషన్ల మొదటి విడత ప్రక్రియ మే 1 నుంచి ప్రారంభమై జూన్ 30 వరకు కొనసాగుతాయి. జూన్ 2 నుంచి కళాశాలలు పునఃప్రారంభించి, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని ఒక ప్రకటనలో తెలియజేశారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ



మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు పట్టణ కేంద్రంలోని ఎనిమిదో వార్డులో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ముస్లిం మహిళలకు గురువారం కుట్టుమిషన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మైనార్టీ అధ్యక్షుడు ఎండీ జాంగిర్ మాట్లాడుతూ.. మైనార్టీ కార్పొరేషన్ ముస్లిం మహిళల అభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందన్నారు. 12 మంది మహిళలకు కుట్టుమిషన్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసద్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు రకం ధాన్యం దించుకోవాలి

వనపర్తి, మే 1 (ఆంధ్రజ్యోతి) : సన్న వడ్లతో పాటు ప్రతీ మిల్లరు 5వేల బస్తాల దొడ్డు వడ్లు విధిగా దించుకోవాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మిల్లర్లు, మిల్లుల అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. యాసంగి సీజన్‌లో సన్న వడ్లతో పాటు కొంతమంది రైతులు దొడ్డు వడ్లు సైతం పండించారని ఇది దాదాపు జిల్లాలో దాదాపు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఉంటుందన్నారు. మిల్లర్లు అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

వేసవి శిబిరం సద్వినియోగం చేసుకోవాలి



పెద్దమందడిలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విష్ణువర్ధన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో గురువారం వేసవి క్రీడా శిబిరం ప్రారంభించినట్లు కోచ్ దేవేందర్ తెలిపారు. జూన్ 6 వరకు క్రీడా మైదానంలో ఉదయం, సాయంత్రం చిన్నారులకు అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. చిన్నారులు వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని అన్నారు. ప్రకాష్, రామకృష్ణ, పాల్గొన్నారు.

మదనాపురం : ప్రభుత్వం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడా శిక్షణ కార్యక్రమంను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రశాంత్, మద్దిలేటి, వెంకటనారాయణ, రాంనారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

పెద్దమందడి : పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఉచిత వేసవి హాకీ శిక్షణ శిబిరాన్ని సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటస్వామి, మన్యంయాదవ్ పాల్గొన్నారు.

పాన్‌గల్ : మండలంలోని మహమ్మదాపూర్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. గోవర్ధన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దేశదారుఢ్యం కలుగుతుందని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని జాతర మైదానం క్రీడా ప్రాంగణంలో అలాగే మూలమల్ల గ్రామంలో కబడ్డీ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఖాదర్, మొబైల్ బాలు, అజ్మతుల్లా పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం

ఆత్మకూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలకృష్ణారెడ్డి, రామలక్ష్మారెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసులు అన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పట్నం కురుమూర్తి అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. అనంతరం బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి, సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో రూ.10 వేలను దహన సంస్కారాల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను శాలువాలతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, మే 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడి మాడ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వీపర్‌గా 28 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ ఉస్మాన్ కుమారుడు అబ్దుల్ రెహమాన్ అదే పాఠశాలలో చదువు తూ పదో తరగతి పరీక్ష ఫలితాలలో 521 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచాడు. టాపర్ అబ్దుల్ రెహమాన్, తండ్రి మహమ్మద్ ఉస్మాన్‌ను గురువారం మాజీ సర్పంచ్ మోహన్‌జి, చాంద్‌పాషా శాలువాతో ఘనంగా సత్కరించారు.

పెబ్బేరు రూరల్ : మండలంలోని మాంటిసోరీ, మాస్టర్‌మైండ్ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్త ప్రతిభను కనబరిచారు. మాస్టర్‌మైండ్, మాంటిసోరీ విద్యార్థులను ఉపాధ్యాయులు సన్మానించారు.

పాన్‌గల్ : జడ్పీహెచ్ఎస్ బుసిరెడ్డిపల్లి, జడ్పీహెచ్ఎస్ కదిరెపాడు, జడ్పీహెచ్ఎస్ బాలికల పాన్‌గల్ పాఠశాలలు 100 శాతం ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యాధికారి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.

శ్రీరంగాపూర్ : మండల కేంద్రానికి చెందిన ఎండి ఆరిఫ్ కుమారుడు ఎండి ఇమ్రాన్ 543 మార్కులు సాధించాడు. దీంతో ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.


కొత్తకోట : పట్టణంలోని నివేదిత హైస్కూల్ పదో తరగతి విద్యార్థులను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి గురువారం సన్మానించారు. శ్రావణ్ కుమార్‌రెడ్డి (574), ప్రతిహస్ రెడ్డి (572), జయసూర్యగౌడ్ (571), అక్షయ (570)ను ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌కు పిలిచుకొని శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలియజేశారు.

కార్మికులను కడుపులో పెట్టి చూసుకుంటాం

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- త్వరలోనే వనపర్తికి ఈఎస్ఐ ఆసుపత్రి



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయధికారి రజని



వనపర్తిలో మునిసిపల్ కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను కడుపులో పెట్టుకుని చూసుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం మేడే సందర్భంగా జిల్లా కేంద్రంలోని మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కార్మికులతో సమావేశమై కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే వనపర్తిలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పుట్టపాకల మహేష్, కృష్ణ, సతీష్, చందర్ పాల్గొన్నారు.

కార్మికుల రక్తంలో నుంచి పుట్టిందే ఎర్రజెండా

వనపర్తి టౌన్ : కార్మికుల రక్తంతో తడిసిన ఎర్ర బట్టలే ఎర్ర జెండాగా మారి కార్మికుల గుర్తుగా మారిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. గురువారం మేడే దినోత్సవాన్ని సీఐటీయూ, సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని కార్మికులతో కలిసి సీఐటీయూ జెండాను ఎగురవేశారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 1886లో ఎనిమిది గంటల పనిదినాల కోసం అమెరికా దేశంలోని చికాగో నగరంలో జరిగిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో మృతిచెందిన వారి రక్తంతో ఎర్రజెండా ఎర్పడిందన్నారు. ఎండీ జబ్బార్, గట్టయ్య, మదన్, భాస్కర్, రాములు పాల్గొన్నారు.

- పట్టణంలో సీపీఐ, ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట ఎర్రజెండా ఎగురవేశారు.

- మేడే వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. బొలమోని రాములు, ఆవుల శ్రీను, లక్ష్మన్న, వెంకటేష్ పాల్గొన్నారు.

- కార్మికులు మేడే స్ఫూర్తితో తమ హక్కుల కోసం పోరాడాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ అన్నారు. రాజు, గణేష్, ఏదుట్ల కురుమయ్య, సుబ్బయ్య పాల్గొన్నారు.

వనపర్తి లీగల్ కంట్రీబ్యూటర్ : కార్మికులు వారి హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజని సూచించారు. గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా జిల్లా మార్కెట్ యార్డులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

పోరాటాలతోనే హక్కులు సాధ్యం

ఆత్మకూరు : పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధ్యమని ఆయా కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆయా గ్రామాలు, వ్యవసాయ మార్కెట్ కార్యాలయాల్లో ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్మికులతో కలిసి మేడే సంబరాలను నిర్వహించారు. హమాలీ కార్మికులు, వ్యవసాయ కార్మికులు , గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ జిల్లా నాయకులు మద్దిలేటి జెండావిష్కరణ చేశారు. దాసర్ల భూమయ్య, పానుగంటి శ్రీనివాసులు, వెంకటేష్, లక్ష్మీ నారాయణ, శేఖర్, రాములు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల కష్టం మరువలేనిది

వీపనగండ్ల : గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికుల కష్టాలను మరువలేనివని గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వారి పాత్ర కీలకమని పర్యాటక శాఖ నాగర్‌కర్నూల్ జిల్లా అధికారి కల్వరాల నరసింహ అన్నారు. గురువారం మండల పరిధిలోని కల్వరాలలో పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు.

చిన్నంబావి : మండల కేంద్రంలో కొప్పునూరులో హమాలీ సంఘం నాయకులు జెండా ఆవిష్కరించారు

కార్మిక చట్టాన్ని కాలరాస్తున్న ప్రభుత్వాలు

పాన్‌గల్ : కార్మిక చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తుందని సీపీఎం మండల కార్యదర్శి బాల్యా నాయక్ అన్నారు. గురువారం మేడే ఉత్సవాన్ని మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి తండాలో సీపీఎం ఆధ్వర్యంలో గిరిజనులు ఘనంగా నిర్వహించారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మికులు, కర్షకులు కూలీల పొట్టకొడుతుందని దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తుందని, కాపాడుకునేందుకు పోరాడాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్ పిలుపునిచ్చారు. కళావతమ్మ, కాకం బాలస్వామి, బాలస్వామి పాల్గొన్నారు.

అమరచింత : మేడే వేడుకలను గురువారం అమరచింత మండలంలో వివిధ పార్టీల సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు.

రెపరెపలాడిన ఎర్ర జెండా

కొత్తకోట : కొత్తకోట, నిర్వేన్, కానాయపల్లి, పాలెం, అమడబాకుల, రానిపేట, మిరాసిపల్లి, రామనంతపూర్, అప్పరాల, రామకృష్ణాపూర్, పామాపురం, కనిమెట్ట గ్రామాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జితేందర్‌రెడ్డి, శ్రీనివాసులు, విశ్వేశ్వర్, వామన్‌గౌడ్, చెన్నకేశవరెడ్డి, రాములు, భీమన్ననాయుడు, నిక్సన్ పాల్గొన్నారు.

చికాగో స్ఫూర్తితో మరో పోరాటం

మదనాపురం : చికాగో కార్మికుల స్ఫూర్తితో దేశంలో మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉందని సీపీఎం మండల కార్యదర్శి వెంకటరాములు అన్నారు. గురువారం మేడే సందర్భంగా మండల కేంద్రంలో ఎర్రజెండాను ఆవిష్కరించారు.

వనపర్తి విద్యావిభాగం : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం టీఎస్ యూటీఎఫ్ వనపర్తి జిల్లా కార్యాలయంలో మేడే ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు రామన్ గౌడ్ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు.

కార్మికులకు ఘన సన్మానం

పెబ్బేరు : ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పెబ్బేరు మునిసిపాలిటీలోని హమాలి సంఘం భవనంలో గురువారం జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు హమాలి సంఘం సభ్యులను శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అక్కి శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ సాగర్, అక్కమ్మ, యుగేందర్ పాల్గొన్నారు.

కష్ట జీవులు ఏకం కావాలి

వీపనగండ్ల : కష్ట జీవులు ఏకమై పోరాటాలు నిర్వహించినప్పుడే తమ బతుకులు మారుతాయని సీపీఎం మండల కార్యదర్శి డి.బాల్‌రెడ్డి తెలిపారు. గురువారం వీపనగండ్ల, గోపాల్‌దిన్నె, తూముకుంటలో సీఐటీయూ, కేవీపీఎస్ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బాలగౌడ్, రాధాకృష్ణ, వెంకటయ్య, వెంకటేశ్వరగౌడ్, ఆశన్న, నిరంజన్ పాల్గొన్నారు.



వనపర్తిలో నిర్వహించిన మే డే సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట ఆంజనేయులు



కొత్తకోటలో మేడే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న హమాలీ కార్మికులు